క్లుప్తంగా

కొండలమ్మకు మొక్కుల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



పెరిశేపల్లి(పామర్రు): పామర్రు మండలంలోని పెరిశేపల్లి గ్రామంలోని కృష్ణం ఓల్డేజ్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎన్‌ఆర్‌ఐ అజితేష్ వల్లూరు, కృష్ణ ఫౌండేషన్, గుడివాడకు చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారి సహకారంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఐ అజితేష్ డల్లాస్ యూఎస్‌ఏలో ఎంఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ప్రథమ సంవత్సరంలో తాను దాచుకున్న పాకెట్ మనీ, ప్రైవేటుగా చేసిన ఉద్యోగ జీతాలను దాచుకుని ఆ నగదుతో పేదలకు ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించినట్లు దాత తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, శస్త్రవైద్య నిపుణులు పాలడుగు వెంకట్రావ్, ఎముకలు, కీళ్ల వ్యాధి నిపుణులు ఎం.భవానిశంకర్, పిల్లల వైద్య నిపుణులు ఎం.శ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్లు వెంకటరావు, జయ ప్రకాష్‌నారాయణ, భాస్కర ప్రసాద్, స్వయం ప్రభ తదితరులు వైద్య సేవలను అందించారు.

ఘనంగా క్యాండిల్ లైట్ మెమోరియల్ డే



గుడివాడ టౌన్: ఎయిడ్స్ బారిన పడి మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని అంకిత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ టి.అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం అంకిత సేవా సంస్థ కార్యకర్తల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ అనేకమందికి అవగాహన లేక ఎయిడ్స్ బారినపడి ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రజల్లో ఎయిడ్స్ యొక్క ప్రమాదాన్ని తెలియజేయాలనే సంకల్పంతో పట్టణంలో ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. హెచ్ఐవీ సోకినవారు ఏ విధమైన సంకోచం లేకుండా ఏఆర్‌టీ సెంటర్‌లో ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న వైద్యసేవలు, పౌష్టికాహారం పొందడంతో పాటు ఆరోగ్య స్థితిగతులపై సెంటర్ ఇస్తున్న కౌన్సిలింగ్‌లో అవగాహన పొందాలని ఆయన కోరారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.బేబీ సరోజిని, అంకిత వర్కర్లు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. నెల్లూరు జిల్లా మొగిలిచర్ల దత్త స్వామి గురువు ఆరాధనా మహోత్సవాల సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఏఎస్సై వి.భాగ్యవతి వితరణతో కార్యక్రమం నిర్వహించినట్లు సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ గఫార్, కంతేటి హరిబాబు, వెంకట్, నాగరాజు పాల్గొన్నారు.

గురజలో అన్నసమారాధన



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజగౌడ రామాలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. శ్రీసీతారామ స్వామి వారి శాంతి కల్యాణమహోత్సవాల సందర్భంగా ఈ సమారాధన జరిగింది. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ పూజలు చేసి అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, మరీదు వసంతరావు, యార్లగడ్డ హేమంత్, రాచూరి కుమార్, పుట్టి సుబ్బారావు, పోకల కృష్ణ, అల్లాడి సతీష్, ప్రభు, సాయి, ఆదిత్య, వినయ్, తేజ, నాని, రమేష్, కోటేశ్వరరావు, సతీష్, పేర్ని పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం



విత్తనాలు జల్లుతున్న రైతులు (ఫైల్)

గుడ్లవల్లేరు: తొలకరిలో వ్యవసాయ సాగుకు సమాయత్తం అవుతున్న రైతులకు ముఖ్యంగా విత్తన కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం. గతంలో రకరకాల విత్తనాలను కలిపి దళారులు అమ్మడం వలన వరి పొలాల్లో బెరుకు వచ్చిన సందర్భాలున్నాయి. రైతన్నకు అవసరమైన విత్తనాలను మార్కెట్‌లో కొనుగోలు చేసేటపుడు ఈ సీజన్‌లో అయినా సరైన జాగ్రత్తలు పాటిస్తే మోసపోవాల్సిన అవసరం ఉండదు. అలాగే ఎరువులు, సస్యరక్షణ మందుల కొనుగోలులో కూడా పాటించాల్సిన విషయాలపై గుడివాడ వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి సూచనలు ఇచ్చారు.

సంరక్షణ మందులు కొనుగోలు ఇలా..

ప్రభుత్వ గుర్తింపు పొందిన తయారీ సంస్థల ఎరువుల బస్తాలను మాత్రమే కొనుగోలు చేయాలి. ఏ వివరాలు లేని సంచులలో ఇచ్చే ఎరువులను ఎట్టి పరిస్థితుల్లో కొనరాదు. కొనుగోలు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. సంరక్షణ మందులు కొనుగోలు చేయునపుడు సీలు సరిగా ఉన్న డబ్బాలు, సీసాలు చూసి, రశీదుతో పాటు కొనాలి. ఐఎస్ఐ ముద్ర ఉన్నవాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. మందు ప్యాక్‌పై మందులు తయారీ చేసిన తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా ఉండాల్సిందే.. అలా ఉంటేనే ఆ మందులను వాడాలి. మోసపూరిత మాటలు నమ్మి, రైతులు మందులను తెలియని వ్యక్తుల వద్ద కొనరాదు. వ్యవసాయ శాఖచే లైసెన్సు ఇవ్వబడ్డ డీలర్ వద్దనే విత్తనాలు, ఎరువులు, సంరక్షణ మందులు బిల్లుపై కొనుగోలు చేయాలి. అలాగే ఎండోసల్ఫాన్, బి.హెచ్.సి–10శాతం, ఇథైల్ పేరాథ్యాన్ రకాల పురుగుమందులను మార్కెట్‌లో విక్రయించినా కొనుగోలు చేయవద్దు. ఈ పురుగు మందులను రద్దు చేశారు.



ఏఓ అనంతలక్ష్మి

కొనుగోళ్లలో జాగ్రత్తలు ఇవి..

- వ్యవసాయ శాఖ లైసెన్సు పొందిన విత్తన దుకాణ డీలరు లేదా ప్రభుత్వంచే గుర్తించబడిన సంస్థల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తన సంచిపై లాట్ నంబరు, కాల పరిమితి చూసి, విత్తనాలు కొనాలి. రశీదును తప్పనిసరిగా తీసుకోవాలి.
- రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచులు, ట్యాగ్‌లు, రశీదులను పంట కాలం పూర్తయ్యేవరకూ భద్రపరుచుకోవాలి.
- విత్తే ముందు రైతు విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించి, విత్తుకోవాలి. దీని వలన సమయం ఆదా అవుతుంది.
- ముఖ్యంగా బిల్లు, ఖాళీ సంచి ఉంటేనే విత్తనం నాశిరకం అని, సాగులో తెలిస్తే, నష్ట పరిహారాన్ని ఆయా కంపెనీల నుంచి ఇప్పించేందుకు అవకాశం ఉంటుంది.

విద్యార్థులకు ఆటల పోటీలు



పామర్రులో విద్యార్థులతో మాట్లాడుతున్న గంథాలయ అధికారి ఝాన్సీరాణి



ఖోఖో ఆడుతున్న బాలురు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు ఆదివారం పుస్తక పఠనం, ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో క్యారమ్స్, చెస్, లూడో గేమ్స్ నిర్వహించారు. రిటైర్డ్ గ్రంథాలయాధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు విద్యార్థులకు సుమతీ శతక పద్యాలు వివరించడంతో పాటు భక్తిపాటలు నేర్పించి పుస్తక పఠనం చేయించారు. పరిసర ప్రాంతాల విద్యార్థులు విజ్ఞాన శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని గ్రంథాలయాధికారి కోరారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వేసవి సెలవుల్లో బాల బాలికల సందడికి నెలవుగా గ్రంథాలయాలు మారాయని గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి అన్నారు. ఆదివారం అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, ఆటల పోటీలను నిర్వహించారు. విజ్ఞాన శిబిరాల పేరుతో వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బాల బాలికలు చక్కగా వినియోగించుకుంటున్నారని గ్రంథాలయాధికారులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పామర్రు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని స్థానిక గ్రంథాలయ అధికారి ఝాన్సీ రాణి అన్నారు. స్థానిక పామర్రు శాఖ జిల్లా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిక్షణపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. మొక్కను నాటడమే కాకుండా దాని పరిరక్షణ బాధ్యతలను తీసుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.

సుందరయ్యకు ఘన నివాళులు



గుడివాడలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఆదివారం జరిగింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.రఘు మాట్లాడుతూ సుందరయ్య నమ్మిన సిద్ధాంతం కోసం తన తుది శ్వాసవరకు పనిచేశారన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఎన్నో కార్యక్రమాల ద్వారా పేదల పక్షాన నిలబడి పోరాడిన నాయకుడన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: దక్షిణ భారత దేశ కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పామర్రులో పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. స్థానిక చాట్లవానిపురంలో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి శాఖ కార్యదర్శి చాట్ల రాంబాబు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రముఖ వైద్యులు సురేష్‌చంద్రారెడ్డి, సీపీఎం నాయకులు భీమేశ్వరరావు, గంగాధర ప్రసాద్, చాట్ల శ్రీనివాసరావు, లక్ష్మణ్, విల్సన్, రాఘవులు, పెదబాబు, నాగభూషణం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కమనీయం.. గోకర్ణేశ్వరుడి కల్యాణం

- నందీశ్వరుడిపై ఊరేగిన కల్యాణమూర్తులు



కల్యాణతంతును నిర్వహిస్తున్న పండితులు

కోడూరు: దివిసీమలో అతి పురాతనమైన శైవక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణ మధ్య శనివారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా జరిపారు. ప్రత్యేక పల్లకిలో అమ్మవార్లను, నందీశ్వరుడిపై స్వామివారిని కల్యాణవేదిక వద్దకు తీసుకొచ్చి మచిలీపట్నంకు చెందిన పండితులచే కల్యాణతంతును నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కొత్తలంక జగన్నాథశర్మ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ సుధాకర్ స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

కల్యాణమూర్తులకు గ్రామోత్సవం

కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిలో నందీశ్వరుడిపై కల్యాణమూర్తులను లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి గ్రామంలో ఊరేగించారు. ఉదయం గోకర్ణేశ్వరస్వామివారి లింగాకారుడికి ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణం వద్ద మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కైకలూరు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో తామరకొల్లు ఉన్నత పాఠశాల ఆదివారం సందడిగా మారింది. పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 70 మంది ఆదివారం పాఠశాలలో ఒకేచోట కలుసుకున్నారు. చదువులు చెప్పిన గురువులు మునుకుట్ల సుధాకరరావు, కొత్తపల్లి సంజీవరెడ్డిని పూర్వ విద్యార్థులు సన్మానించారు. దాదాపు 24 సంవత్సరాలు తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు యోగాక్షేమాలను తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయడంలో నున్న రాంబాబు, లేళ్ల సునీల్, మనిమేల రవి, గంగుల శ్రీనివాసరావు, దొమ్మేటి చంద్రరావు, ఉచ్చుల హరి, దండే ప్రసన్న, దాసరి రామారావు, బొల్లెంపల్లి నాగ ప్రసన్న కీలకపాత్ర పోషించారు.

లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ ఇంద్రశ్రీనివాస్

గుడివాడరూరల్: గుడివాడలో లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని వన్‌టౌన్ సీఐ కె.ఇంద్రశ్రీనివాస్ తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పట్టణానికి చెందిన గొర్ల రామారావు లాటరీ టికెట్లు విక్రయిస్తున్నాడని తమకు సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 11వ తేదీన రామారావును అదుపులోకి తీసుకుని విచారించగా తనతో పాటు కె.కుమార్ అనే వ్యక్తి కూడా టికెట్లు విక్రయిస్తున్నట్లు తెలిపాడన్నారు. ఈ క్రమంలో కుమార్ కోసం గాలింపు చేపట్టగా ఆదివారం తాము అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వీరిద్దరిని బైండోవర్ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో లాటరీ టికెట్లు, గంజాయి, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే స్థానికులు తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జూదాలు నిర్వహించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఐ స్పష్టం చేశారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్, ప్రసాద్

పమిడిముక్కల: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఐనంపూడిలో శ్రీకృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం, గ్రామంలోని విశ్రాంత ఉద్యోగులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన లక్ష్మీప్రియాంకకు రూ.5 వేలు, బొల్లా మోహనకు రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు. కమిటీ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న కమిటీని ఎస్ఐ అభినందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కొల్లి వెంకట ప్రసాద్, ఉపాధ్యక్షుడు శీలం మురళి, కార్యదర్శి శీలం రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కపిలేశ్వరపురం, అగినపర్రు, మామిళ్లపల్లి, గౌడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, పటమట లంకపల్లి, అప్పారావుపేట, వెట్టివానిగూడెం ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన రేణుక అంకమ్మ తల్లి సంబరాలు

పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురంలో జరుగుతున్న శొంఠి వంశస్థుల ఇలవేల్పు రేణుక అంకమ్మతల్లి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి శొంఠి వంశస్థుల కుటుంబ సభ్యులు, ఆడపడుచులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయం వద్ద భక్తులకు అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

హెచ్ఐవీ మృతుల ఆత్మశాంతికి కొవ్వొత్తుల ర్యాలీ



ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం హెచ్ఐవీతో మరణించినవారికి నివాళులర్పించేందుకు, వారి ఆత్మలకు శాంతిని చేకూర్చేందుకు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తారు. లింక్ వర్కర్లు సీహెచ్ నాగలక్ష్మి, జన్ను చంద్రావతి, రామిశెట్టి సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కొవ్వొత్తుల ర్యాలీలో ఏఎన్ఎం జి.సాజన్య, ఆశావర్కర్లు నరసమ్మ, లిల్లీ పుష్ప, పంచాయతీ వార్డు సభ్యురాలు కె.కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువును శుభ్రం చేయాలి



అపరిశుభ్రంగా ఉన్న మంటాడ రెడ్డిపాలెం చెరువు

పమిడిముక్కల: అపరిశుభ్రంగా మారిన మంటాడ రెడ్డిపాలెం వద్ద నున్న చెరువును శుభ్రం చేయాలని రెడ్డిపాలెం వాసులు కోరుతున్నారు. ఈ చెరువుకు మూడు వైపులా ఇళ్లు, ఒకవైపు రహదారి ఉంది. ఈ చెరువంతా గుర్రపుడెక్క, తూటుకాడతో నిండిపోయి ఉండటంతో మందు పిచికారీ చేశారు. దీంతో గుర్రపుడెక్క మాడిపోయింది. చెరువులో గుర్రపుడెక్క, తూటుకాడ పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీంతోపాటు దోమలతో రెడ్డిపాలెం వాసులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలన్నింటినీ పూర్తి స్థాయిలో తొలగించి చెరువును శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

ఉపాధి పనులతో బహుళ ప్రయోజనాలు



అయ్యవారిరుద్రవరంలో పంట కాలువ బాగుజేస్తున్న ఉపాధి కూలీలు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రధానంగా రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉపాధి పనుల ద్వారా పంట కాలువలను బాగుజేస్తుండటంతో పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా లభిస్తోంది. రైతులకు ఎలాటి ఇబ్బందులు లేకుండా పొలాలకు నీరు వస్తుండటంతో పంటలు పుష్కలంగా పండి అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం కలుగుతుంది.

కూలి రేటు పెంచిన ప్రభుత్వం

వ్యవసాయ పనులు లేని తరుణంలో కూలీలకు ఈ పనుల ద్వారా ఉపాధి కలుగుతోంది. ఉపాధి కూలీలకు ప్రభుత్వం కూలి బాగా పెంచడంతో వారి కుటుంబ అవసరాలకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది. గతంలో కూలి రూ. 272 ఉండేది. ప్రస్తుతం కూలి రేటు ప్రభుత్వం రూ.300కు పెంచింది. పురుషులకు, మహిళలకు పనులకు ఎలాంటి ఢోకా లేకుండా ఉంది.

తాగునీటి సమస్యలకు చెక్

కాలువల ద్వారా తాగునీటి చెరువులు, వాడుక చెరువులకు నీరు చేరుతోంది. దీంతో ప్రజల తాగునీటి సమస్యలకు చెక్ పెట్టినట్లయింది. వాడుక చెరువులు నీటితో నిండటంతో పశువులకు తాగునీటి వెతలు తీరాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలు సమకూరుతున్నాయి.

ఖాళీ బాటిల్స్‌లో పెట్రోల్ విక్రయిస్తే చర్యలు




మాట్లాడుతున్న సీఐ ఏసుబాబు

గుడివాడరూరల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో గుడివాడ తాలూకా సర్కిల్ పరిధిలో ఉన్న పెట్రోల్ బంకుల యజమానులు ఖాళీ బాటిల్స్‌లో పెట్రోలు కొట్టవద్దని గుడివాడ తాలూకా సీఐ కె.ఏసుబాబు పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడివాడ తాలూకా పరిధిలోని నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ మండలాల్లోని పెట్రోల్ బంకుల యజమానులు ఖాళీ బాటిల్స్, డబ్బాల్లో పెట్రోలు కొట్టవద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసు వారి సూచనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పెట్రోల్ బంకుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో ఉన్న కిరాణా షాపుల వద్ద లూజు పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేయరాదన్నారు. అలా కాకుండా ఎవరైనా విక్రయిస్తే సంబంధిత గ్రామాల్లోని ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బంకుల యజమానులతో పాటు, కిరాణా షాపుల యజమానులు కూడా పోలీసుల నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

విడిగా పెట్రోలు విక్రయించొద్దు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెట్రోలు బంకుల యజమానులు ఎలాంటి పరిస్థితుల్లోనూ పెట్రోలు, డీజిల్ విక్రయాలు విడిగా చేయరాదని ఎస్సై వెంకట్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెట్రోలు బంకుల్లో పనిచేసే సిబ్బంది విడిగా బాటిళ్లు, డబ్బాలలో వీటిని విక్రయించరాదని పేర్కొన్నారు. ఈ విధంగా విక్రయిస్తే అసాంఘిక శక్తులు అల్లర్లకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినట్లయితే ఈ కేసులలో పెట్రోలు బంకు నిర్వాహకులపై సైతం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆకట్టుకున్న హరికథా కాలక్షేపం



ప్రేక్షకులను అలరించిన హరికథా కాలక్షేపం

ఎలకుర్రు(పామర్రు): భ్రమరాంబ సమేత చెన్నమల్లికార్జునస్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా రెండోరోజు ఆదివారం వేద పఠనం, హరికథా కాలక్షేపాలను నిర్వహించారు. తొలుత స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. ధర్మకర్త నాగేశ్వరారవు స్వామివారి పల్లకిసేవలో పాల్గొన్నారు. హరికథలను ప్రతిఒక్కరూ ఆదరించాలని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు అన్నారు. అనంతరం హరికథకులను నాగేశ్వరరావు సన్మానించారు. వేదాంతం రాధేశ్యామ్ బృందం వారిచే భక్త ప్రహ్లాద నాటకం ఆహూతులను అలరింపజేసింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ హరిదాసులు నాగమల్లేశ్వరీ, సత్యనారాయణ భాగవతార్‌ల హరికథలు నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణమహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 30 మంది దంపతులు పీటలపై కూర్చొని స్వామి కల్యాణం జరిపించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణ మధ్య స్వామికి మంగళ సూత్రధారణ గావించారు. వివిధ గ్రామాల నుంచి స్వామి కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సుమారు 1,500 మందికి అన్నసమారధన నిర్వహించారు.